విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 05, సెప్టెంబరు 2024

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి

- ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టపరచాలి
- 6వ తేదీ కలెక్టరేట్ ఎదుట ధర్నా.. జయప్రదం చేయండి
- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్

విశాలాంధ్ర-నంద్యాల .. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టపరచాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 6వ తేదీ సిపిఐ దేశవ్యాప్త ఆందోళన భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరుగు ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబాఫక్రుద్దీన్, గోస్పాడు మండల కార్యదర్శి హరినాథ్, మండల సహాయ కార్యదర్శి జిలానిభాషలు డిమాండ్ చేశారు. బుధవారం గోస్పాడు మండలం పసురపాడు సిపిఐ శాఖ సమావేశం కంబగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బియ్యం, పప్పులు, చింతపండు వంటి నిత్యావసర సరుకులతో పాటు కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయని, పేద, మధ్యతరగతి ప్రజలు ఏం కొనేట్టు, తినేట్టు లేదన్నారు. దీనికి తోడు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా పెంచిందని, అధిక ధరల తగ్గింపు హామీలు కేవలం ఎన్నికల ప్రచారానికే పరిమితమయ్యాయని ఆరోపించారు. సమావేశంలో శాఖ సభ్యులు నడిపి వెంకటేశ్వర్లు, సుంకన్న, నరసింహులు, చిన్నబ్బి, చిన్న కంభగిరి, మహిళా సభ్యురాళ్లు కంభగిరమ్మ, లక్ష్మీదేవి, సరోజనమ్మ, చిట్టమ్మ పాల్గొన్నారు.

ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

విశాలాంధ్ర-ఆత్మకూరు రూరల్ : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాపక్రుద్దీన్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ పట్టణ ఎస్ అహ్మద్ హుస్సేన్ అధ్యక్షతన తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయం నుండి పాత బస్టాండ్ మీదుగా ఎమ్మార్వో ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ జిల్లా రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 11 సంవత్సరాల లో ప్రజలకు మాయమాటలు చెప్పి మభ్యపెట్టి మోసం చేశారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కేజీ రోడ్డు హమాలి యూనియన్ నాయకులు చాంద్ బాషా, లల్లు, సీపీఐ కొత్తపల్లి మండల కార్యదర్శి వెంకట శివుడు, మహిళా సంఘం జిల్లా నాయకురాలు స్వాతి, తాలూకా కార్యదర్శి ముర్తుజావలి, ఏఐటీయూసీ ఇసుక హమాలి రౌఫ్, సిద్దయ్య, పుల్లయ్య, రసూల్, మా భాష, షేక్షావలి, అలీ షేర్, లింగస్వామి, ఐ.సామి తదితరులు పాల్గొన్నారు.

తీవ్రంగా ఇబ్బందిపడుతున్న పేదలు

విశాలాంధ్ర-నందికొట్కూరు : రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో సామాన్య పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, రఘురామమూర్తిలు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన కేజీ రోడ్డుపై ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసిల్దార్ కిషోర్ కి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు, నూనె, కూరగాయల ధరలు ఆకాశాన్ని అందుతున్నాయని ,దీనికి తోడు పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులు ఇవ్వాల్సిన ప్రభుత్వం నాసిరకం బియ్యం ఇచ్చి చేతులు దులుపుకుంటుందన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుంది తప్ప పేద ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ధరలు అధికంగా పెరగటం వలన సామాన్య ప్రజలు మూడు పూటలా కడుపునిండా తృప్తిగా భోజనం చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డు మంజూరు చేయాలని పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని ఆహార భద్రత చట్టం అమలు చేయాలని, నివాస స్థలం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రజితమ్మ భాను, సులోచనమ్మ ,ఏఐటీయూసీ వెంకటేశ్వర్లు, డేవిడ్ రమేష్, దావీదు, ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్,భార్గవ్, ఆనంద్,బన్నీ,మధు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఎమ్మెల్యే అఖిలప్రియ

రూ.5 లక్షలు విరాళం

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : విజయవాడ వరద బాధితులకు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అండగా నిలిచారు. స్వర్గీయ భూమా శోభనాగి రెడ్డి ట్రస్ట్ తరపున రూ.5 లక్షలు విరాళంగా ప్రకటిస్తున్నామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. స్థానిక స్వగృహంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలో ప్రజల బాధలు చూస్తుంటే ఆళ్లగడ్డలో జరుగుతున్నంత బాధగా ఉం దన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల స్థితిగతులను నేరుగా తెలుసుకుంటున్నారని, రాష్ట్రం లోని ఇతర ప్రాంతాల అధికారులను అందరినీ విజయ వాడకు చేర్చి వారితో సహా యక చర్యలు చేపట్టడం జరిగిం దన్నారు. మేము కూడా విజయవాడలోని 43వ వార్డులో ఒక ప్రాంతాన్ని ఎంచుకొని ట్రస్టు తరపున అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ వరదలకు ముఖ్య కారణం ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి భవన సముదాయాలను నిర్మించడమే అన్నారు. ఆళ్లగడ్డ పరిధిలో కూడా ఎవరైనా ప్రభుత్వ భూములు, కాలు వలు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టి ఉంటే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని లేకపోతే ఏ పార్టీ వారైనా, ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

ఎమ్మెల్యే అఖిలప్రియ పిలుపుతో వరద బాధితులకు విరాళాలు: ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ పిలుపుమేరకు విజయవాడ వరద బాధితుల కోసం ఆపన్న హస్తము అందించేందుకు పలువురు ముందుకు వచ్చారు. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ప్రజ్ఞా విద్యా సంస్థల చైర్మన్ హేమలత రెడ్డి, నరసింహారెడ్డి దంపతులు రూ. 40 వేలు, ఆళ్లగడ్డ టిడిపి నాయకులు సింగం భరత్ రెడ్డి రూ. 10 వేలు, రుద్రవరం మండలం ఆలమూరు, కొండ మాయపల్లె పివి రమణ, సింగతల మహేష్ రెడ్డిలు చెరో 10 రూపాయల విరాళం ఎమ్మెల్యే అఖిల ప్రియకు అందజేశారు.

రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-నంద్యాల : రాష్ట్రవ్యాప్తంగా కురిసిన వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా పంటలు నష్టపోయారని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 29 మండలాలలో 11.238 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అధికారులు వెల్లడించారని, ముఖ్యంగా ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, నందికొట్కూరు, జూపాడుబంగ్లా, గడివేముల, వెలుగోడు, గోస్పాడు, రుద్రవరం మండలాలలో పంట నష్ట తీవ్రత ఎక్కువగా ఉన్నదని, పంటలు దెబ్బతిన్న ప్రాంతాలలో వ్యవసాయ అధికారులు పర్యటించి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. ముఖ్యంగా కౌలు రైతులు తీసుకున్న పొలాలకు కౌలు చెల్లించాలని, కాబట్టి కౌలు రైతులకు అదనంగా రూ.10 వేలు ఇవ్వాలన్నారు. నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు రూ.30 వేలు, కౌలు రైతులకు రూ.40 వేలు అందించాలని కోరారు.

నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా బేబీ

విశాలాంధ్ర-నందికొట్కూరు : నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా బేబీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఇప్పటివరకు ఎమ్మిగనూరు మున్సిపాలిటీ లో రెవిన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అందరి సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నూతన కమిషనర్‌ను టీడీపీ కౌన్సిలర్స్, కార్యాలయ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మట్టి వినాయకులను పూజిద్దాం

విశాలాంధ్ర-నంద్యాల .. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను పూజిద్దామని గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల డైరెక్టర్ పి షేక్షావలి రెడ్డి పేర్కొన్నారు. నంద్యాలలో పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలంటే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను విడనాడాలన్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పాఠశాల ఉపాధ్యాయులకు 200ల మట్టి వినాయకులను షేక్షావలి రెడ్డి పంపిణీ చేశారు. ప్రకృతి మానవాళికి ఓ వరం లాంటిదని, అలాంటి ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

దెబ్బతిన్న పంటను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర ఆత్మకూర్ రూరల్ : నంద్యాల జిల్లా,ఆత్మకూరు మండలం కొత్తరామాపురం, నల్లకాలువ, కరివేన గ్రామాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను నంద్యాల కలెక్టర్ రాజకుమారి పరిశీలించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలో పంట నష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు తాసిల్దార్ రత్న రాధిక, డిప్యూటీ తాసిల్దార్ మనోహర్, వ్యవసాయ శాఖ అధికారులు, ఏ.డీ.ఏ. బి. ఆంజనేయులు, మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్, రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ శివప్రసాద్ రెడ్డి, కొండలరావు, దినకర్ రైతు సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన కుందరవాగు..

-నిలిచిన రాకపోకలు

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: ఆళ్లగడ్డ, మాయలూరు ఆర్అండ్‌బి ప్రధాన రహదారిలో ఇంజేడు గ్రామ సమీపంలో కుందర వాగు వంతెనపై వర్షపు నీరు ఉప్పొంగి ప్రవహిస్తూ ఉంది. దీంతో బుధవారం ఈ రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. గోస్పాడు, దొర్నిపాడు, కోవెలకుంట్ల మండలాల్లో వాగులు, వంకలు, పంట పొలాల్లోని వర్షపు నీరంతా కుందరు వాగులో వచ్చి చేరుతూ ఉంది. ఉధృతంగా ప్రవహిస్తున్న కుందరవాగును దాటేందుకు ప్రయాణికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వర్షాలకు గుడిసెలపై కూలిన చెట్టు

విశాలాంధ్ర - వెలుగోడు : వర్షాలకు వెలుగోడు గట్టు తాండ లోని రెండు గుడిసెలపై భారీ చెట్టు కూలి పడింది. నల్లమల్ల అటవీ ప్రాంతానికి సమీపంలో గల గట్టు తండా నందు సేవానాయక్, శక్రు నాయక్ గిరిజనుల ఇంటిపై భారీ వృక్షం అయితే ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇంట్లో వస్తువులు దెబ్బతిన్నాయి. రెవెన్యూ అధికారి చక్రధర్ సంఘటన స్థలాన్ని రిపోర్టు తయారుచేసి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

గంజాయి విక్రయదారులు అరెస్టు

విశాలాంధ్ర-నంద్యాల : నంద్యాల జిల్లాలో గంజాయి సప్లయ్ చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల టౌన్‌కు చెందిన 4 గురు వ్యక్తులు పలుసార్లు అరకు నుండి గంజాయి కొనుగోలు చేసి నంద్యాలకు తీసుకొచ్చి 100 గ్రాముల చిన్న చిన్న ప్యాకెట్స్ గా చేసి, ఊరి చివర్లలో తిరుగుతూ సాధువులకు, నంద్యాల టౌన్‌లో యువకులకు అధికరేటుకు అమ్ముకొని సొమ్ముచేసుకుంటున్నారు. ఆ క్రమంలో గంజాయిని నంద్యాల టౌన్, హరిజనపేట వద్ద ఉన్న కొత్త నీళ్ళ ట్యాంక్ వద్ద విక్రయిస్తుండగా నలుగురిని పట్టుకొని వారి వద్ద నుండి సుమారు 2.25 కేజీల గంజాయి, ఒక మోటార్ సైకిల్ ను సీజ్ చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించడానికి సహకరించిన సిఐలు సుధాకర్ రెడ్డి, సురేశ్ కుమార్ ఎస్పీ, డీఎస్పీఅభినందించారు.

కుందూ పరివాహక ప్రాంతాలపై దృష్టి పెట్టండి

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : మంత్రి ఫారుక్

విశాలాంధ్ర నంద్యాల రూరల్: పది రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల వల్ల నంద్యాల డివిజన్ ప్రాంతంలోని కుందు నది ఉప్పొంగి పారుతోందని, పరివాహ ప్రాంతాలపై అధికారులందరూ దృష్టి సారించాలని అలాగే గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పార్టీలకతీతంగా పరిష్కరించాలని ఏపీ న్యాయశాఖ మంత్రి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అలాగే సంక్షేమ ప్రత్యేక అధికారి మల్లికార్జునరెడ్డిలు వెల్లడించారు. బుధవారం నంద్యాల మండల సర్వసభ్య సమావేశం నంద్యాల ఎంపీపీ శెట్టి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల కుందు పరివాహన ప్రాంతాలైన పివి నగర్, నందమూరి నగర్,చాపిరేవుల, పుసులూరు, బ్రాహ్మణపల్లి, అలాగే గోస్పాడు మండలంలోని రాయపాడు, తెలపూరు ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తాసిల్దార్ వ్యవస్థను తీసివేసి మండలి వ్యవస్థను ఏర్పాటు చేశారని, కానీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యవస్థను తీసివేసి తాసిల్దార్ వ్యవస్థను ప్రవేశపెట్టడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఆయా గ్రామాల అభివృద్ధిపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని వారికి తెలియజేశారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా అధికారులను సంప్రదించి లేక మమ్ములను కలవాలని సభాముఖంగా తెలియజేశారు. సమావేశంలో ఎండిఓ సుగుణశ్రీ, ఎమ్మార్వో పద్మప్రియ, ఏవో ప్రసాదరావు, ఆర్డబ్ల్యూసీ ఏఈ మురళి నాయక్ ట్రాన్సుకో ఏఈ శ్రీనివాసులు, మండల పరిషత్ కార్యాలయ ఏవో షహన్నా, ఎన్ఆర్ఈజీఎస్ శ్రీకళా రెడ్డి, సర్పంచులు ఓబులేసు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోండి

విశాలాంధ్ర - నంద్యాల : వినాయక నిమజ్జన మహోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎ.పద్మజ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి కమిటీ సభ్యులను సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సెంటనరీ హాలులో వినాయక నిమజ్జన మహోత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. నంద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డి, నంద్యాల డీఎస్పి యుగంధర్ బాబు, ఆళ్లగడ్డ డిఎస్పి రవికుమార్, కేంద్ర గణేష్ మహోత్సవ కమిటీ సభ్యులు జి రామకృష్ణారెడ్డి, విజయ్ కుమార్, చలంబాబు, నిమ్మకాయల సుధాకర్, నాగేంద్ర, శంకర్, పుల్లయ్య, సత్యం, కృష్ణమాచారి, చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఆర్డీఓ ఎ.పద్మజ మాట్లాడుతూ కలెక్టం ఆదేశాల మేరకు ఈనెల 11వ తేదీన స్థానిక చిన్న చెరువు కట్ట వద్ద ఉన్న వినాయక ఘాట్ లో వినాయక నిమజ్జన ఏర్పాట్లకు సంబంధించిన పనులు జరుగుతున్నాయన్నారు. కమిటీ సభ్యులు సూచించిన అంశాలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆ మేర ఏర్పాట్లు చేస్తామన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు గణేష్ మండపాల విద్యుత్ కనెక్షన్లకు 1100 రూపాయలు చెల్లిస్తామని, పారిశుద్ధ్యం, తాగునీటి వసతి, భారికేడ్ల ఏర్పాటు, గజ ఈతగాళ్లు, బోట్లు లైటింగ్ తదితర అంశాలన్నింటిపై శ్రద్ధ వహిస్తామన్నారు. గణేష్ మండపాలలో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రతి మండపంలో రెండు బకెట్ల ఇసుక, ఒక డ్రమ్ము వాటర్, బెడ్ షీట్ తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు.

ఘనంగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టినరోజు వేడుకలు..

విశాలాంధ్ర-నంద్యాల : నంద్యాలలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.టిడిపి నాయకులు, కార్యకర్తలు గజ మాలలతో, కేకులతో, మేళ తాళాలతో పండుగ వాతావరణంలో ఎన్ఎండి ఫిరోజ్ పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ ప్రజల అభిమానాన్ని నేనెప్పటికీ మర్చిపోలేనని సోషల్ మీడియా, ఫోన్ ద్వారా, నేరుగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. అనంతరం అభిమానులు మాట్లాడుతూ ఫిరోజ్ నిండు నూరేళ్లతో అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఫిరోజ్ పుట్టినరోజు సందర్భంగా రక్తదానం

విశాలాంధ్ర-నంద్యాల : నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పుట్టినరోజు సందర్భంగా నంద్యాల బ్లడ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో ఎన్ టిఆర్ షాధిఖాన నందు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం వద్ద 38వ వార్డు వైస్సార్ నగర్ టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బుగ్గరాముడు మాట్లాడుతూ మనం రక్తదానం చేయడం వలన ఒక నిండు ప్రాణాన్ని కాపాడిని వారమవుతామని, రక్తం ఇవ్వడం వలన చాలా వరకు ఆరోగ్య సమస్యలు రాకుండ కాపాడుకోవచ్చని, రక్తం ఇవ్వడం వలన ఆరోగ్యానికి చాలా మంచిదన్నారు. ఇప్పటికి 16 సార్లు రక్తదానం చేసిన వేణు గోపాల్‌ని ఆయన అభినందించారు.

కుందూ, మద్దిలేరు వాగు, చెరువులను పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర-నంద్యాల : కొన్ని రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలకు నంద్యాల పట్టణం మీదుగా ప్రవహిస్తున్న కుందూ నది, మద్దిలేరు వాగులలో నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున బుధవారం నంద్యాల ఎస్పీ ఆదిరాజ్ సింగ్ వాటిని పరిశీలించి వరద ఉధృతి గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే నంద్యాల చెరువును కూడా పరిశీలించారు. స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి సంతోష్, 2వ పట్టణ సిఐ ఇస్మాయిల్, ట్రాఫిక్ సిఐ మల్లికార్జున గుప్త పాల్గొన్నారు.

పెంచలకోన పవిత్ర మాలలకు పూజలు

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : నెల్లూరు జిల్లాలోని శ్రీ పెనుశీల లక్ష్మీనరసింహ స్వామి వారి పవిత్రోత్సవాలకు వినియోగించే పవిత్ర మాలలను బుధవారం అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో ఉంచి ఆలయ ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాల ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని సంవత్సరాల నుండి రంగారావు గోష్టి సభ్యుల తరపున పవిత్ర మాలలను అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి పాదాల చెంత ఉంచి ఆ పవిత్ర మాలలను పెంచలకోన అర్చకులకు అందజేయడం ఆనవాయితీగా జరుగుతోంది. అహోబిల దేవస్థానం ముద్రకర్త, ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్యులు, మనియర్ సౌమ్య నారాయణన్ స్వామి, ఎగువ అహోబిలం మనియందార్ సుదర్శనం స్వామి, భార్గవస్వామి పెంచలకోన దేవస్థానం ముఖ్యఅర్చకులు రామయ్య స్వామికి పవిత్రమాలలను అందచేశారు.

వంద రోజుల్లో గృహాలు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-చాగలమర్రి : జిల్లాలోని లే అవుట్లలో అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలను వంద రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం చాగలమర్రి పట్టణం లోని నారాయణపల్లె రస్తాలోని ప్రభుత్వ లే అవుట్లను పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ మహమ్మద్ దౌలా అధ్యక్షతన హౌసింగ్,ఉపాధి హామి,సచివాలయ ఇంజనీరింగు సహాయకుల తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూబేసుమేంట్లు,రూఫ్‌లెవెల్ ఉన్న గృహాలను గుర్తించి డిసెంబరు నాటికి పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. 90 రోజుల ఉపాధి పనుల భిల్లులను లబ్ధిదారుల ఖాతాలో వేయించడం జరుగుతుందన్నారు కార్యక్రమం లో హౌసింగ్ ఈఈ హరిగోపాల్ ,హౌసింగ్ డిఈ నాగరాజు,ఏఈ షఫివుల్లా,ఏపిఓ నిర్మల,ఉపాధి,హౌసింగ్ సిబ్బంది,సచివాలయాల ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

బిజినవేముల వైసిపి సర్పంచ్ టీడీపీలో చేరిక

విశాలాంధ్ర. నందికొట్కూరు .. నందికొట్కూరు మండలం బిజీనవేముల గ్రామ వైసిపి సర్పంచ్ రవి యాదవ్, బుధవారం అల్లూరు గ్రామం లోని మాండ్ర స్వగృహంలో నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్త జయసూర్య, సమక్షంలో300 కుటుంబాలతో టిడిపిలో చేరారు. సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు పోవడం జరుగుతుందని, కాబట్టి మా గ్రామ అభివృద్ధి కోసం వైసిపి నుంచి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరడం జరిగిందన్నారు. వారందరికీ ఎమ్మెల్యే జయ సూర్య టిడిపి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వార్డు నెంబర్లు మరియు గ్రామ నాయకులు శ్రీనివాసులు, మహమ్మద్ రఫీ, ఉషన్ మియా, యాకోబు, బాషా, శివలింగం, శాలుబాషా, మద్దిలేటి, చిన్నన్న, సుధాకర్, బాలకృష్ణ, సలుద్దీన్,శేఖర్ పాల్గొన్నారు.

కుందరవాగును పరిశీలించిన తహశీల్దార్

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: ఇంజేడు గ్రామ సమీపంలో కుందరు వాగుపై ప్రవహిస్తున్న వర్షం నీటి ప్రవాహాన్ని తహశీల్దార్ శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. మండలంతో పాటు ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలతో నీరంతా కుందరవాగులో చేరడంతో వంతెనపైన వర్షపు నీరు ప్రవహిస్తూ ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఆర్.పాంపల్లె గ్రామం మీదుగా వెళ్లాలని సూచించారు. కుందూనదికి ప్రస్తుతం వరద ఉధృతి తగ్గిందని, పూర్తిగా వృద్ధి తగ్గేంతవరకు మత్స్యకారులు, దోబీలు కుందూనదిలోకి వెళ్ళరాదన్నారు. వరదల వల్ల జరిగే నష్టాన్ని అంచనా వేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. నివేదికలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఎస్సై రామాంజనేయులు రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ తులసికృష్ణ, వీఆర్వో దాదాసాహెబ్ ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-చాగలమర్రి ..ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ మహబూబ్ దౌలా,ఏఎస్ఐ నబీలు కోరారు. బుధవారం కలుగోట్లపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల వద్ద వక్కిలేరు వాగు రోడ్డు పై ప్రవహిస్తుండడంతో, పరిసరాలను పరిశీలించారు. కలుగోట్లపల్లె, బ్రాహ్మణపల్లె,ఆవులపల్లె గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కూలిపోయే సిద్ధంగా ఉన్న ఇళ్లల్లో ఎవరు నివాసం ఉండరాదు అన్నారు. పరివాహ ప్రాంతాల్లో నీటిలోకి విద్యుత్ స్తంభాల వద్దకు ఎవరు వెళ్లొద్దన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక

విశాలాంధ్ర-అవుకు: పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బషీర్ అహ్మద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ హేమీమా తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం నంద్యాలలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నారు.

వర్షాలకు కూలిన మట్టి మిద్దెలు..

విశాలాంధ్ర, రుద్రవరం : పెద్ద కంబలూరు గ్రామానికి చెందిన గుర్రప్ప, తిప్పారెడ్డిపల్లె గ్రామానికి చెందిన వెంకటమ్మ అను వీరు తమ కుటుంబీకులతో, మనవరాళ్లతో తమకున్న మట్టిమిద్దెలలో జీవనం సాగిస్తున్నారు. చాలా సంవత్సరాల క్రితం నిర్మించిన మట్టి మిద్దెలు కావడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా నాని మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఒక్కసారిగా కూలిపోయాయి. ఆ సమయంలో శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : కోవెలకుంట్ల పట్టణంలోని ఆంజనేయ స్వామి గుడి దగ్గర అబ్దుల్ ఖాదర్ జిలాని చెందిన మట్టిమిద్దె కూలింది. ఇంట్లో ఎవరూ లేకపోవడం వల్ల ప్రాణనష్టం తప్పింది.

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, గురువారం 05,సెప్టెంబర్ 2024

రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి-కె.జగన్నాధం

విశాలాంధ్ర-కర్నూలు: రైతులు పండించిన పంటకు ప్రభుత్వం గిట్టు బాటుధర కల్పించాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం కోరారు. బుధవారం దిన్నె దేవరపాడులో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నికల జరిగింది. ఈ కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు సురేంద్ర యాదవ్ అధ్యక్షత వహించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు కె.జగన్నాథం,సీపీఐ నగర కార్యదర్శి వి.రామ కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక పోవడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు.నకిలీ ఎరువులు, నకిలీ విత్తనాలు'నకిలీ క్రిమిసంహారక మందులతో రైతులు తీవ్రనష్టానికి గురవుతున్నారన్నారు.జిల్లాలోని 106 చెరువులకు నీళ్ల నింపాలని దీనివలన జిల్లాలోనివంట పొలాలకు సాగునీరు, తాగునీరు అందుతుందని అన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారిపైన కేసుల నమోదు చేయాలని అన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

గ్రామశాఖ అధ్యక్షులుగా హరి కృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా చిన్న పకీర, సెక్రటరీగా యం.ఈశ్వర్‌లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, రైతు నాయకులు రాజు నాయక్, దొడ్డి పాడు భాష మరియు రైతులు శ్రీను, చిన్నరాజు, లోకేష్, అరవింద్,విమరాజు,చిన్న శేషన్న, దొడ్డి పోగు నాగరాజు, రాజు, సతీష్, హరికృష్ణ, నరేష్, నాగేంద్ర అఖిల్, చిన్న పకీర, జయపాల్,మద్దిలేటి, రంగన్న, గోపాల్, కె.వి. విజయ్, పెద్ద రాముడు, అయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన ధరలు తగ్గించాల్సిందే-కె.జగన్నాధం

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : నిత్యావసర వస్తువుల ధరలు పెట్రో, డీజిల్‌లపై పెంచిన ధరలు తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్నాదం డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు బుధవారం కర్నూలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నగర సహాయ కార్యదర్శి సి.మహేష్ అధ్యక్షత ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి జగన్నాథం మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు బియ్యం, కందిపప్పు, కూరగాయల ధరలు పెట్రో,డీజిల్ ధరలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ధరలు అదుపుచేస్తామని హామీ ఇచ్చిన పదేళ్లయినా ధరలు అదుపు చేయడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. బియ్యం కిలో రూ. 60,వంటగ్యాస్ రూ.950, కందిపప్పు రూ. 210, నూనె 220 ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు మూడుపూటల కడుపు నిండా సృప్తిగా భోజనం చేయలేని పరిస్థితి నెలకొందన్నారు.చౌక దుకాణాల్లో 14 రకాల నిత్యావసర వస్తూవుల ధరలు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే నిత్యావసర వస్తూవుల ధరలు తగ్గించాలని, అర్హులైన వారందరికి రేషన్ కార్డు మంజూరు, పెట్రో,డీజిల్ ధరలు తగ్గించాలని ఆహార భద్రతాచట్టం అమలు చేయాలన్నారు. అంతకు ముందు సీపీఐ నగర కార్యదర్శి పి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నగర శివారులో ఇందిరమ్మ, టిడ్కో గృహాలు నిర్మించి ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారాయన్నారు. కర్నూలు నగర శివారులో నివాసస్థలాలు లేని నిరుపేదలు అక్రమించుకొని గుడిసేలు వేసుకున్న అర్హులైన పేదవారికందరికి నివాసస్థలం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అంతకు ముందు ప్రజానాట్య మండలి కళా కారులు ఆలపించిన గేయాలు ప్రజలను అలరించాయి. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం తహశీల్దార్ కార్యాలయంలో అందచేశారు.

ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, నగర కార్యవర్గ సభ్యులు బీసన్న, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శి గిడ్డమ్మ, శ్రావణిరెడ్డి, మహిళా నగర అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్రమ్మ, భారతి, సహాయ కార్యదర్శి పావని, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు నల్లన్న, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, సీపీఐ నాయకులు శైలజ, కోటమ్మ తదితరులున్నారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

విశాలాంధ్ర-పెద్దకడబూరు : మండల పరిధిలోని ముచ్చిగిరి గ్రామ సమీపంలోని గంగమ్మ గుట్టకొండలో ముచ్చిగిరికి చెందిన నెట్టికల్ నరసప్ప, మేకల తిక్కన్న నాటుసారా తయారీ చేస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ నిరంజన్‌రెడ్డి పోలీసు సిబ్బందితో బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒకొక్కరి నుంచి ఐదు లీటర్ల చొప్పున మొత్తం 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని నగరపాలక సంస్థ కార్యాలయ మేనేజర్ ఎన్.చిన్నరాముడు సూచించారు. బుధవారం 125, 126, 130వ సచివాలయాలను మేనేజర్ ఆకస్మికతనిఖీ చేశారు.ఆయా సచివాలయాల్లో హాజరు, మూమెంట్ దస్త్రాలు పరిశీలించారు. ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడి, ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

కూలిన ఇండ్లు లబ్ధిదారులకు పరిహారం పంపిణీ

విశాలాంధ్ర-చిప్పగిరి: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కూలిన ఇండ్లు లబ్ధిదారులకు పరిహారము అందజేయడం జరిగిందని ఇంచార్జ్ తహసీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం చిప్పగిరితో పాటు మండల కాజీపురం, నగరడోన, ఏరురూ గ్రామాల్లో అధిక వర్షాలకు పాక్షికంగా కూలిన ఇండ్లు లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన పరిహారం లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. చిప్పగిరి-4, కాజీపురం -2, నగర డోన-1, ఏరురూ-1 మొత్తం మండలంలో 8 గృహాలు పాక్షికంగా కూలిపోవడం జరిగిందన్నారు. ఒక్కొ కుటుంబానికి 20 కిలోల బియ్యం, కిలో చక్కెర, రూ.4 వేలు నగుదును అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్ స్వామి, రెవెన్యూ కార్యదర్శి తిమ్మప్ప, సర్వేయర్ హనుమాన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ మాదిగల జన్మహక్కు

విశాలాంధ్ర-పత్తికొండ: ఎస్సీ వర్గీకరణ మాదిగల జన్మహక్కు అని మాజీ మంత్రి మూలింటి మారెప్ప పేర్కొన్నారు. బుధవారం పత్తికొండలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాల తిరుపాల్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వల్ల మాదిగల తో పాటు 59 ఉప కులాలకు మేలు జరుగుతుందన్నారు.మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో సుదీర్ఘ పోరాటం చేసిన ఫలితంగానే సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్రాలకు అధికారం కల్పిస్తూ తీర్పును ఇవ్వడం జరిగిందన్నారు. ఆర్టికల్ 341ను సవరించి దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిందని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధులను విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాల తిరుపాల్, నాయకులు సుధాకర్, శాంత కుమారి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

విశాలాంధ్ర-తుగ్గలి: మండల వ్యాప్తంగా బుధవారం జిల్లా కలెక్టర్ రంజిత్ భాష పర్యటించారు.పగిడిరాయిలో అధికవర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. అనంతరం అధికారుల ద్వారా రైతుల నుండి పలు సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అధిక వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని,నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌కు వివరించారు.నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.అనంతరం జొన్నగిరి ప్రభుత్వ బాలురవసతి గృహాన్ని తనిఖీ చేసి, విద్యార్థులతో మాటామంతి నిర్వహించారు.ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమం ప్రారంభించారు. వసతి గృహానికెళ్లిన కలెక్టర్‌కు విద్యార్థులు,వసతిగృహ అధికారులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ వసతి గృహాలు, పాఠశాలలోని సౌకర్యాల గురించి విద్యార్థుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే అన్ని సౌకర్యాలు వినియోగించుకొని చక్కగా చదువుకొని ఉన్నత స్థానాల్లో నిలవాలని జిల్లా కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. అనంతరం వసతి గృహ వార్డెన్ రమేష్,వసతి గృహవిద్యార్థులతో కలిసి కలెక్టర్ రంజిత్ భాషకు అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్యాణి,ఆర్డీవో రామలక్ష్మి, తహసిల్దార్ నాగరాజు,ఎంపీడీవో సావిత్రి,ఎంఈఓ రమా వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్,ఏపీవో రామకృష్ణ,హౌసింగ్ డిఈ విజయ్ కుమార్,ఎంపీపీ ఎర్ర నాగప్ప,సర్పంచ్ ఓబులేసు, మండల స్థాయి అధికారులు,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ గౌడ్ తమ పోలీస్ సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ విద్యారంగా పరిరక్షించుకుందాం-ఏఐఎస్ఎఫ్ నేతలు

విశాలాంధ్ర-కౌతాళం రూరల్: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని అందుకోసం విద్యార్థులు పోరాటనికైనా సిద్ధంగాఉండాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న,జిల్లా కార్యదర్శి సాబీర్‌భాష పిలుపు నిచ్చారు.బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ మండల జనరల్ బాడీ సమావేశం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్ అధ్యక్షతన జరిగింది.ఈసమావేశానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, డి.సోమన్న, ఎస్.షాబీర్ భాషలు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. కౌతాళం జిల్లా కేంద్రానికి దూరంగా ఉండటంతో అక్షరాసత అంతంత మాత్రమే. పైగా ప్రభుత్వ వసతిగృహం లేకపోవడంతో విద్యార్థులు సుదూర ప్రాంతానికి వెళ్లలేక మధ్యలోనే విద్యను మానేసి, నిరక్ష్యరాసులుగా మారుతున్నారనీ ఆందోళన వ్యక్తం చేశారు. అక్ష్యరాస్యత పెంచేందుకు వసతి గృహాలు మంజూరుకు జిల్లాస్థాయి అధికారులు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించి మంజూరు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కౌతాళం మండలంలోనూ ఏపీ ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ గోడ ఏర్పాటుచేయాలన్నారు.ఇప్పటికైనా మండల విద్యా శాఖాధికారులు చొరవ తీసుకొని మండలంలో ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణ,ప్రవేట్, కార్పొరేట్ విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు.

నూతన కమిటీ ఎన్నిక:

మండల అధ్యక్షులుగా సాయి వర్మలి ఉపాధ్యక్షులుగా గంగారం, మంజునాథ్, ఘోర, ఉమేష్, మండల ప్రధాన కార్యదర్శిగా హనుమేష్‌లి, సహాయ కార్యదర్శులుగా, ఖాదర్,ఆంజనేయులు, మహేష్, గోవిందు,కోశాధికారి-ఉరుకుందు, మహిళా కన్వీనర్ గా, ఎస్.పూజ, కో-కన్వీనర్లు కె.నాగరత్న, లత, శైలజ, సంగీత, మల్లేశ్వరి, ధనలక్ష్మిలతో పాటు 19 మంది కార్యవర్గ సభ్యులు,29 మంది సమితి సభ్యులుగా ఎన్నుకున్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు, దస్తగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉపేంద్ర, గురు, మంజునాథ్, మండల నాయకులు లింగన్న, ఉమేష్, మహేష్, వీరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ఎల్లెల్సీలో పడ్డ ఎడ్ల బండి

విశాలాంధ్ర-పెద్దకడబూరు : మండల పరిధిలోని మేకడోన లో బుధవారం ఎల్ఎల్సీ కాలువ సమీపంలో పొలానికి ఎరువు బస్తాలు తీసుకు వెళుతున్న ఎడ్ల బండి రోడ్డు మీద అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలో పడింది. ఈ ప్రమాదంలో రెండు ఎడ్లకు గాయాలయ్యాయి. 20 ఎరువుల బస్తాలు నీట మునిగి సుమారు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లిందని రైతు చాకలి ఉసేని వాపోయారు. ఎడ్లను, బండిని గ్రామస్తులు అతి కష్టంతో బయటకు తీశారు.

పారిశుద్ధ్యం పనులు వేగవంతం-కమిషనర్

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : ఎడతెరవి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య సిబ్బంది పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని నగరపాలక కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్ సూచించారు. బుధవారం 1వ శానిటేషన్ డివిజన్ పరిధిలో కందేరి, సాయిబాబా నగర్, కొత్తపేటప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. రహదా రులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, మురుగు నీటి కాలువల్లో చెత్తాచెదారం వెనువెంటనే తొలగిస్తూ ఉండాలని సూచించారు.వరద సహాయక చర్యల కోసం ప్రజారోగ్య విభాగం నుండి 100 మంది కార్మికులు, నలుగురు ఇన్‌స్పెక్టర్లు, 16 మంది కార్యదర్శులు విజయవాడ వెళ్ళారని, నగరంలో వారు పనిచేస్తున్న ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల్లో చేరిన వర్షపు నీరు తక్షణమే తొలగిస్తున్నట్లు తెలిపారు. పైప్‌లైన్ల క్రాసింగ్‌తో పాటు ఇతరత్రా చోట్ల తాగునీరు కలుషితం కాకుండా ఎమిని టీస్ కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఆరోగ్యధికారి విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్వైజర్ నాగరాజు, ఇన్‌స్పెక్టర్లు లోకేష్‌లు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-కల్లూరు: మహిళలు బహిర్ భూమికి వెళ్లలేక తీవ్ర అవస్థలు పడుతున్నామని వెంటనే మరుగుదొడ్లను పునరుద్దరించి సమస్యను పరిష్కరించాలని బుధవారం పందిపాడు మహిళలు గ్రామ నాయకుడు శేఖర్ చౌదరి స్వగృహంలో కలిసి విన్నవించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలు విన్నవించి పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన శేఖర్ చౌదరి మాట్లాడుతూ ఎమ్మెల్యే గౌరు చరిత దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బోయ నాగరాజు, కురువ శేఖర్‌లున్నారు.

కెవి సుబ్బారెడ్డిలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-కల్లూరు: నగర శివారులోని మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బుధవారం దుపాడు వద్ద గల డాక్టర్ కె వి సుబ్బారెడ్డి ఇంజ నీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం పెద్దఎత్తున నిర్వహించారు. కార్య క్రమానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, ఎంపీ నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరి యం హాల్‌లో లీప్స్ సంస్థ వారి ఆనివర్సరీ సందర్భంగా "ఎంటర్ప్రె న్యూ రియల్ విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి ,ఏపీఎస్పీ బెటాలియన్ డిఎస్పీ మహబూబ్‌బాషా, డాక్టర్ గోవిందరెడ్డి,తాలుక సీఐ శ్రీధర్, ఉలింద కొండ ఎస్సై ధనుంజయ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

విశాలాంధ్ర-కౌతాళం: స్థానిక ప్రతిభ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం ఉపాధ్యాయులకు పాఠశాల సెక్రటరీ మైనుద్దీన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు పిల్లల పట్ల చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వారికి కూడా మానసిక ఉల్లాసం కొరకు పోటీలను నిర్వహించి ఉల్లాసాన్ని ఆనందాన్ని అందించగలమని అన్నారు. ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కొరకు. నిరంతరం ఎనలేని కృషి చేస్తారన్నారు. తల్లిదండ్రుల సహకారం ఎంతైనా ఉండాలని సందర్భంగా తెలియజేశారు.ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వేలంపాటల్లో భారీగా తగ్గిన ఆదాయం

విశాలాంధ్ర-ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు దినసరి టమోటా, కూరగాయల మార్కెట్ వేలం పాటను బుధవారం పోలీసు బందోబస్తు మధ్య ఇన్చార్జి ఈవోఆర్డి రామ్మూర్తి ఆధ్వర్యంలో సర్పంచు శ్రీనివాసులు అధ్యక్షతన మార్కెట్ వేలం పాటలను ప్రశాంతంగా నిర్వహించారు. స్థానిక గ్రామ చావిడి ఆవరణంలో నిర్వహించిన ఈ వేలం పాటలో ఇద్దరు పాటదారులు పాల్గొన్నారు. దినసరి టమోటా కూరగాయల మార్కెట్‌కు అధికారులు వేలంపాట నిర్వహించగా బాట వీరేష్ అనే వ్యక్తి రూ.45,64,000 లక్షలతో మార్కెట్‌ను దక్కించుకున్నారు. బాట వీరేష్, గోవిందరాజులు మధ్య ముఖాముఖిగా జరిగిన పోటీలో బాట వీరేష్ రూ. 45.64 లక్షలకు వేలం పాటను దక్కించుకున్నాడు. గతేడాది రూ.58,70,750 వేలకు వేలం పాట పొగ.. ఈ సంవత్సరం రూ.45.64 లక్షలు వేలం పాటతో గతేడాది కంటే రూ.13 లక్షలు ఆదాయం తగ్గినట్లు ఇంచార్జి ఈఓఆర్డి రామ్మూర్తి, తెలిపారు. గత నెలలో మార్కెట్లో వేలం పాటలో జరిగిన ఘర్షణల నేపథ్యంలో పోలీసు బందోబస్తు మధ్య ఈ వేలంపాటలో నిర్వహించామని తెలిపారు. గతేడాది కంటే ఈ సంవత్సరం పంచాయతీకి ఆదాయం తగ్గినట్లు ఆయన తెలిపారు. గ్రామపంచాయతీ నిబంధన మేరకే వేలంపాటను దక్కించుకున్న కాంట్రాక్టర్ నడుచుకోవాలని అధికారులు సూచించారు.ఈవేలంపాటలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ మస్తాన్ వలి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తును నిర్వహించారు. ఈ వేలంపాటలో డి ఎల్ వి ఓ కార్యాలయ సిబ్బంది రవికుమార్, పంచాయితీ కార్యదర్శులు లక్ష్మన్న, సునీల్, వీరేష్ సిబ్బంది ఖాజ, వైసీపీ మండల కన్వీనర్ పెద్దయ్య, మాజీ ఎంపీపీ వెంకటేష్, గ్రామ పెద్దలు హనుమంతురెడ్డి, నాగరాజు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి వేలాదిగా తరలిరండి-సీపీఐ నేతల పిలుపు

విశాలాంధ్ర-పెద్దకడబూరు : పెంచిన నిత్యా వసర వస్తువుల ధరలు తగ్గించాలంటూ దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక బస్టాండ్ ఆవరణంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ మాట్లాడుతూ ప్రజా పంపిణీ ద్వారా 14 రకాల నిత్యవసర సరుకులను ప్రజలకు ఇవ్వాలన్నారు.ఈ నెల 6న కర్నూలు కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ప్రజలు, రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు గిడ్డయ్య, మహమ్మద్, హుసే, లక్ష్మన్న, ఉరుకుంద, వెంకటేశు, నారాయణ, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ రూరల్: పెరుగుతున్న నిత్యావసర ధరలతో సామాన్య పేదలు కొని,తినే పరిస్థితుల్లో లేరని, పెంచిన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం. నరసారావు డిమాండ్ చేశారు ఈ సందర్భంగా సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి వి. రాజశేఖర్ అధ్యక్షతన తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.ఈనెల 6న జిల్లా కలెక్టర్ కార్యాలయ ముట్టడికి పిలుపునివ్వడం జరిగిందన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఏపీ రైతు సంఘం మండల గౌరవ అధ్యక్షులు వై.కండప్ప, పట్టణ సహాయ కార్యదర్శి కృష్ణ, ప్రజా సంఘాల నాయకులు వీరాంజనేయులు, నరసింహ, శ్రీను, కోదండ, నరేష్, మహబూబ్, రమేష్, నాయుడు, లోకేష్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ట పరచాలని కోరుతూ సీపీఐ జా తీయ సమితి పిలుపులో భాగంగా బుధవారం ఎమ్మిగ నూర్ సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్ నందు నిరసన వ్యక్తం చేసి, తాహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగిందని సీపీఐ పట్టణ కార్యదర్శిజి.రంగన్న, సీపీఐ పట్టణ సహాయ కార్య దర్శి సమీవుల్లాలు తెలిపారు.మోడీ సర్కార్ కేవలం కార్పొ రేట్ గుత్తపెట్టుబడిదారుల అడుగులకు మడుగు లొత్తుతూ పాలన సాగిస్తోందే తప్ప సామాన్య ప్రజలు జీవన ప్రమాణాల మెరుగుదలకు ఏమాత్రం ప్రయత్నించడం లేదన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రం డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు.కార్యక్రమంలో సీపీఐ నాయకులు దాదావలి, కెసిజబ్బర్, తిమ్మగురుడు, కాజా, మల్లికార్జున గౌడ్, ఇస్మాయిల్, మాలిక్, సుంకన్న, రాము, నరసప్ప, గోపాల్, హనుమంతు,శ్రీరాములు, నరసింహగౌడ్, వీరాంజిగౌడ్, రవి,రామాంజనేయులు, యోహాన, వీరేష్, శంకర్ జయరాం, ఎల్లప్ప, శంకర్, వీరేష్, షరీఫ్, హుసేని, ఇస్మాయిల్, వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని : పెంచిన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రతిష్ట పరచ డంతో పాటు అర్హులైన వారందరికి రేషన్ కార్డులు ఇవ్వా లని పెట్రో, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జాతీయ పిలుపుమేరకు స్థానిక మున్సిపల్ గ్రౌండ్ నుంచి ర్యాలీగా వెళ్లి డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు.సీపీఐ మండల కార్యదర్శి కలుబావి రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి, పట్టణ కార్యదర్శి సుదర్శన్ పాల్గొని మాట్లాడారు. ఈనెల 6న జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భీమేష్, ఎంకన్న, జిల్లా సమితి సభ్యులు హుసేని, షేక్షావలి,సీపీఐపట్టణ సహాయ కార్యదర్శి విజయ్, ఈరన్న గౌడ్,సీపీఐ పట్టణ మండల నాయకులు గంగన్న, హనుమంతు,సోమన్న,రాము, నాగరాజు, రవిలు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులన్నీంటిని నింపండి

- శ్రీశైలంలో 854 అడుగులున్నప్పటికీ ఎందుకు నిర్లక్ష్యం వహించారు
- హంద్రీనీవా, పోతిరెడ్డి పాడు అధికారుపై ఆగ్రహం వ్యక్తం చేసిన జెడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి
- విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడి పనులు చేయండి
- కేతవరం-పందిర్లపల్లె రోడ్లను వెంటనే వేయండి-పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత
- ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమర్జెన్సీలో బెడ్లు కరువు..శుభ్రత డొల్ల-బొగ్గుల

విశాలాంధ్ర-జిల్లా పరిషత్తు: అధికవర్షాలతో వస్తున్న వరదనీటిని వృధా చేయకుండా అన్ని ప్రాజెక్టులను నింపడం, తాగు,సాగు నీటికి ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎరబోతుల పాపిరెడ్డి అధికారులకు సూచించారు.బుధవారం జిల్లా పరిషత్‌స్థాయి సంఘాల సమావేశం ఛైర్మన్ పాపిరెడ్డి అధ్యక్షత న సిఇఓ. నాసర రెడ్డి సమక్షంలో మినీ మీటింగ్ హాల్ లో నిర్వహించారు.ఈ సందర్భంగా నీటి పారుదల అధికారులను ఉద్దేశించి ఛైర్మన్ మాట్లాడుతూ శ్రీశైలంలో 835కు నీరు రాగానే హంద్రీనీవా 40 టీఎంసీ నీటిని వాడుకోవచ్చు. 885 లెవల్ కు నీరు వచ్చేదాకా హంద్రీనీవా కు ఎందుకు నీటిని వదులుకోలేదు. 845 లెవల్ కు శ్రీశైలంలో నీరు రాగానే పోతిరెడ్డిపాడుకు నీటిని వదులు కోవలిగా ఇలాంటి నిర్లక్ష్యం ఎందుకు చేశారు. అదృష్టవశాత్తూ వరద నీరు,సమృద్ధిగా వర్షానికి నీరు వస్తుంది.ఇలాంటి సందర్భంలో నీటిని వృధాగా పోనియకుండా చర్యలు అధికారులు తీసుకోవాలిగా అని ఛైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా నీటినివృదాగా పోనియకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తాగునీటి, సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.కొలిమిగుండ్ల నందీపాడు దగ్గర పవర్ గ్రీడ్ వర్క్ జరుగుతుందని అక్కడ ఇతర రాష్ట్రాల వారు 600 నుండి 700 మంది కార్మికులు పని చేస్తున్నారు.అక్కడ జరుగుతున్న పనులు నిలిపి అక్కడ ఉండే జేసిబి,ఇటాచి, టిప్పర్లు అన్ని రవాణా శాఖ అధికారులు కొందరి ప్రోద్బలంతో పట్టుకోచ్చి కేసులు రాశారు.రెండు వారాలుగా వారు వేసిన ఫైన్ కట్టి వాహనాలు తీసుకెళ్తామని తిరుగుతున్న ఎందుకు స్పందించారని రవాణా శాఖ అధికారులను ప్రశ్నించారు.అధికారులు స్పందించి రెండు రోజుల్లో ఫైన్ కట్టించి వదులుతామన్నారు.ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ కేతవరం నుండి గార్గేయపురం ,కల్లూరు మండలం పందిర్లపల్లె, గ్రామాలకు అధ్వనంగా రోడ్లు ఉన్నాయని వెంటనే వాటిని వేయాలని పంచాయతీ రాజ్ అధికారులకు తెలిపారు.పాణ్యం మండలం కందినాయుని పల్లెకు తాగునీటి సమస్య పరిస్కారం చేయాలని ఆర్డబ్ల్యూ ఎస్ అధికారులను ఆదేశించారు. అలాగే విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వదిలి ప్రజలకు సమస్యలు లేకుండా అందుబాటులో ఉండాలని ఏ.ఈ లు ఎవ్వరు సరిగా పనులు చేయడం లేదని విద్యుత్ సమస్యలు అడిగితే ఒక్కరు స్పందించడం లేదని విద్యుత్ సమస్యలు లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూప్రభుత్వ సర్వజన వైద్యశాల లో ఎమర్జెన్సీ లో బెడ్లు లేకుండా అపరిశుభ్రంగా ఉన్నాయని వాటిని పరిస్కారం చేయాలని కోరారు.అలాగే బేలగల్ లో బాలికల హాస్టల్ లో మరుగుదొడ్లకు కనీసం డోర్ లు కూడా లేకుండా ఉన్నాయని వాటిని వెంటనే పరిస్కారం చేయాలని తెలిపారు. అధికారులు స్పందించి నాడునెడు పనులకింద చేస్తామన్నారు.నందికొట్కూరు ఎమ్మెల్యే గుత్తా జయసూర్య మాట్లాడుతూరైతులకు ఇస్తున్న విత్తనాన్ని నాణ్యతగా ఇవ్వాలని తెలిపారు.ఎరువుల బస్తాల్లో ఒకటికి 30 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని అలాంటి బ్లాక్ మార్కెట్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు స్పందించి అలాంటి చర్యలను వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.తుగ్గలి జడ్పిటిసి మాట్లాడుతూ రాతన, తుగ్గలి,జొన్నగిరి గ్రామాల రోడ్లు అధ్వనంగా ఉన్నాయని వెంటనే బాగు చేయాలని కోరారు.అలాగే విద్యుత్ అధికారులు చాలా వరస్ట్ గా ఉద్యోగం చేస్తున్నారని పల్లెల్లో కరెంట్ లేక రాత్రిళ్ళు బిక్కు బిక్కు మంటూ గడుపుతున్న పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు.మహానంది జడ్పిటిసి మాట్లాడుతూ మండలంలో చాలా గ్రామాలకు రోడ్లు సరిగా లేవని వెంటనే వాటిని బాగు చేయాలని కోరారు.కోడుమూరు జడ్పిటిసి మాట్లాడుతూ గాజులదిన్నే ప్రాజెక్టుకు ఇంకా 2.2 టీఎంసీ నీటిని నింపాలని రైతులకు నీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.వెల్దుర్తి జడ్పిటిసి మాట్లాడుతూ బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బస్టాండ్ నిర్మాణం చేసి ప్రజలకు ప్రయాణీకులను సౌకర్యం కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఇఓ వెంకట సుబ్బారెడ్డి, పగిద్యాల జడ్పిటిసి దివ్య, ఉమ్మడి జిల్లాల అధికారులుజిల్లా పరిషత్ ఏవో జితేంద్ర,ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణలో సర్పంచు భాగ్యరత్న

విశాలాంధ్ర–కోడుమూరు : విజయవాడలోని కొన్ని ప్రాంతాల్లో వరద బారిన పడి నష్టపోయిన వరద బాధితుల సహాయార్థం కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బి భాగ్యరత్న,పంచాయతీ పాలకవర్గం విరాళాలను సేకరించారు.బుధవారం సర్పంచ్ భాగ్యరత్న,ఈవో అజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో వాటర్ మెన్లు, గ్రామ పంచాయతీ,సచివాలయ సిబ్బంది తదితరులు పట్టణంలోని పురవీధులలో కలియ తిరుగుతూ ప్రభుత్వ కార్యాలయాలు,వ్యాపార సంస్థలు తదితర అన్నివర్గాల ప్రజలను కలుసుకొని విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా భాగ్యరత్న మాట్లాడుతూ ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యరత్న మాట్లాడుతూ ప్రార్థించే పెదవులు కన్నా సహాయం చేసే చేతులే మిన్న అన్న సూక్తికి ఆదర్శంగా తీసుకొని,వరద ప్రభావిత ప్రాంతాల్లో సర్వం కోల్పోయిన ప్రజలకు ప్రతిఒక్కరు అండగా ఉండాలన్న ఆలోచనతోనే ఈ చిన్న ప్రయత్నం చేస్తున్నామన్నారు.ప్రజలు నుండి మంచి స్పందన లభించడం హర్షించదగ్గ విషయం అన్నారు..భిక్షాటన చేస్తూ బస్టాండ్ ప్రాంతంలో తిరిగే వృద్ధురాలు సైతం విరాళాల సేకరణకు స్పందించి తనవంతు సహాయం చేస్తానని ముందుకొచ్చి రు.516లు అందించడం సంతోషకర మన్నారు.అదేవిధంగా చిన్న పాప సైతం తన వంతు విరాళంగా రు.100లు అందించడం జరిగిందన్నారు. విజయవాడలోని కొన్ని ప్రాంతాల్లో వరద బీభత్సం ప్రజల జీవితాలను అతలాకుతలం చేసిందన్నారు.కొన్ని గంటల వ్యవధిలోని పీకల్లోతు నీటిలో కూరకపోయిన వరద బాధితుల జీవితాలు ఉన్నపళంగా చీకటిమయమయ్యాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.మానవత దృక్పథంతో వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరిస్తున్నట్లు చెప్పారు..ప్రతి ఒక్కరు సహాయం చేసి బాధితులకు అండగా నిలిస్తే,వారి నుంచి సేకరించిన విరాళాలను అధిక మొత్తంలో ఒకేసారి సిఎం సహాయ నిధికి అందజేస్తామని ఆమె తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంద్రయ్య, వార్డు సభ్యులు ప్రతాపరెడ్డి,శానిటరి ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు,సచివాలయ సిబ్బంది శ్రీకాంత్,సలీం,భాస్కర్, జనార్ధన్, రామచంద్రుడు, పంచాయతీ సిబ్బంది లక్ష్మీదేవి,సురేష్,వాటర్ వర్కర్స్ అంజద్ భాష,మధు, మహేశ్వరరెడ్డి,దావుద్ తదితరులు పాల్గొన్నారు.

గృహ వినియోగదారులకు రాయితీతో సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు-జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాష

విశాలాంధ్ర బ్యూరో–కర్నూలు : ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద గృహ వినియోగ దారులకు సబ్సిడీతో సోలార్ రూఫ్ టాప్ లను ఏర్పాటు చేయడం జరుగుతోందని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాష విజ్ఞప్తి చేశారు.బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ప్రధానమంత్రి సూర్యకర్ యోజన పథకం అమలుపై సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ వినియోగ దారులు తమ ఇళ్ళ పై కప్పుపై సోలార్ రూఫ్ టాప్ లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లును తగ్గించుకోవచ్చన్నారు.. ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు వంద చదరపు అడుగుల స్థలం అవసరం అవుతుందన్నారు.. ఈ యూనిట్ ద్వారా నెలకు 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు..ఇందు కోసం 60 నుండి 70 వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని, ఇందులో సెంట్రల్ ఫైనాన్స్ అసిస్టెన్స్ కింద 30 వేల రూపాయలు సబ్సిడీ లభిస్తుందని కలెక్టర్ తెలిపారు..వెయ్యి రూపాయలు బిల్లు వచ్చే వారికి సోలార్ ఏర్పాటు తర్వాత కేవలం రూ.338లు బిల్లు మాత్రమే వస్తుందన్నారు.. అలాగే 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ గ్రూప్ టాప్ ను 1.30 లక్షల నుండి 1.40 లక్షల వరకు ఖర్చు తో 200 చదరపు అడుగుల స్థలం లో ఏర్పాటు చేసుకుంటే 240 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, దీనికి రూ.60 వేల సబ్సిడీ లభిస్తుందన్నారు..3 కిలోవాట్ల సామర్థ్యం, ఆపైన రూ.78 వేలు సబ్సిడీ వస్తుందని కలెక్టర్ తెలిపారు..ఈ పథకం కింద బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు పొందే అవకాశం కూడా ఉందన్నారు. ఈ పథకాన్ని జిల్లా లోని గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు..సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును వినియోగదారులు తమ ఇళ్లకు వినియోగించుకోగా, ఇంకా మిగిలితే, దానిని విద్యుత్ శాఖ కొనుగోలు చేసే వెసులుబాటు కూడా ఉందని కలెక్టర్ తెలిపారు..పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా గృహ వినియోగ దారులు ప్రధానమంత్రి సూర్య యోజన పథకాన్ని వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఎన్టీపీసీ ద్వారా ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ రూఫ్ టాప్ ల ఏర్పాటుపై కూడా దృష్టి పెట్టాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై వీటిని ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..జిల్లాలో మోడల్ సోలార్ గ్రామాల ఏర్పాటుకు కూడా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. వెల్దుర్తి, ఉల్లాల, పంచలింగాల, గార్గేయపురం, పర్ల, సి.బెళగల్ మండలాలను మోడల్ సోలార్ గ్రామాలుగా ఏర్పాటు చేసే అవకాశా లు పరిశీలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో నెడ్ క్యాప్ డెవలప్మెంట్ అధికారి వీరేంద్ర బాబు, విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి, ఇంఛార్జి మున్సిపల్ కమీషనర్ రామలింగేశ్వర్, ఎల్డిఎం రామచంద్రరావు, డిపిఓ నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు లింగాకర్షక బుట్టల పంపిణీ

విశాలాంధ్ర–సి.బెళగల్ : రైతులు మొదటి దశలో తక్కువ ఖర్చుతో కూడుకున్న మందులను పిచికారి తీసుకోవాలని కర్నూల్ డివిజన్ ఏడిఏ దస్తగిరి రెడ్డి అన్నారు. బుధవారం బెళగల్ మండల పరిధిలోని బూరాందొడ్డిలో సి.బెళగల్ మండల వ్యవసాయ అధికారి జి మల్లేష్ కుమార్ అధ్యక్షతన పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు ఆత్మ జీఎం శ్రీలత చేతుల మీదుగా మాస్ ట్రాపింగ్ పద్ధతి ద్వారా పత్తి పంటలో 45 రోజుల పంట నుండి ఎకరంలో 2 చొప్పున లింగాకర్షణ అమర్చి పెట్టుకోవడం వల్ల పురుగు ఉధృతిని గమనించి గులాబీ రంగు పురుగు యొక్క నివారణ చేసుకో వచ్చునని ఆమె తెలిపారు. అనంతరం ఆత్మ ఏవో మధుమతి మరియు ఎం గిరీష్ ఏ డి ఏ (డి ఆర్ సి) ఎస్ వెంకటేశ్వర్లు ఏడిఏ (డి ఆర్ సి) మాట్లాడుతూ పత్తి పంటలో వచ్చే తెగుళ్ల మరియు వాటి నివారణపై జాగ్రత్తలను వారు రైతులకు తెలియజేశారు. అదేవిధంగా కర్నూల్ డివిజన్ ఏం దస్తగిరి రెడ్డి మరియు బి శశిధర్ రెడ్డి (ఏ డి ఏ) లు మాట్లాడుతూ రైతులు పంటలో మొదటి దశలో తక్కువ ఖర్చుతో కూడుకున్న మందులు పిచికారి చేసుకోవాలని అదేవిధంగా ఎర పంటలైన కంచ పంటలు మరియు జొన్న సజ్జ పంటలను పొలం చుట్టూ రెండు లేదా నాలుగు వరుసలు వేసుకోవడం వల్ల వంటలపై వచ్చే పచ్చ దోమ మరియు తెల్ల దోమ అలాగే తెగుళ్లను నివారించుకోవచ్చు అని వారు అన్నారు. ప్రతి రైతు మందు పిచికారి చేసేటప్పుడు వేప నూనె కషాయం ను ఒక లీటర్ నీటికి 5 %ఎఫ్రీ% వేప నూనె కషాయం ను కచ్చితంగా పిచికారి చేసుకోవాలని వారు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులతో పాటు వ్యవసాయ సిబ్బంది వి ఏ ఏ లు మారెప్ప, శశికాంత్, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరవస్తువులు కిట్లు అందజేస్తాం-జిల్లా టీడీపీ అధ్యక్షులు తిక్కారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో–కర్నూలు : విజయవాడ లో వరదల కారణంగా జలమయమైన ప్రాంతాల లోని బాదితుల సహాయార్థము కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్వర్యంలో రెండు మూడు రోజులలో వారికి కావలసిన నిత్యావసర వస్తువుల కిట్లను అందజేసేందుకు నిర్ణయం తీసుకున్నామనీ కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తెలియజేశారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆకెపోగు ప్రభాకర్, నాగేశ్వరరావుయాదవ్ మరియు ఇతర నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన పత్రికా, మీడియా ప్రతినిధుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. జిల్లాలోని మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, మాజీ యం.యల్.ఎ.లు, మాజీ యం.పి.లు, మాజీ యం.యల్.సి.లు పార్టీలో వివిధ హెరీదాలలో ఉన్న నాయకులు వరదసహాయక కార్యక్రమాలలో పాలుపంచుకునేలా జిల్లా పార్టీ ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రతి నియోజకవర్గం నుండి 1000 వరకు కిట్లను అందజేసేందుకు కృషిచేస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు యస్. ముంతాజ్, సత్రం రామక్రిష్ణుడు, యస్. నవీన్, సంజీవలక్ష్మి, పి.రవికుమార్, పి.హనుమంతరావు చౌదరి, షేక్షావలి, మొదలగు వారు పాల్గొన్నారు.

విజయవంతంగా వనమహోత్సవం

విశాలాంధ్ర–కర్నూల్ ఎడ్యుకేషన్ : కర్నూల్ నగరంలోని మై పర్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఎ.క్యాంప్‌లో వన మహోత్సవంకార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మైపర్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎ.క్యాంపులో మొక్కలు నాటే కార్య క్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జె.రవి కుమార్ రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ డా.కాసర్ల సురేష్, అకాడమిక్ డీన్ డాక్టర్ ఎం.రాజ్ కుమార్, రఘువీర్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని విజయ ంతంగా నిర్వహించడం జరిగింది.

పట్టణ సి.ఐగా ఓబులేష్ బాధ్యతలు

విశాలాంధ్ర ఆత్మకూరు టౌన్: సాధారణ బదిలీల్లో భాగంగా ఆత్మకూరు పోలీస్ స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి నారాయణ బది లీపై వెళ్లడంతో నూతన సీఐగా ఓబులేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య.

విశాలాంధ్ర-అవుకు: మండలంలోని సంఘపట్నం గ్రామానికి చెందిన చాకలి చిన్న అంకాలు (31) అనే వ్యక్తి పేడ రంగు నీళ్లలో కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాకలి చిన్న అంకాలు తాగుడుకు బానిసై తరచు భార్య లక్ష్మితో గొడవపడేవాడని అన్నారు. బుధవారం మద్యం తాగడానికి డబ్బులు కోసమని గొడవపడి డబ్బులు ఇవ్వలేదని మనస్థాపానికి గురై పేడ రంగు పౌడర్ నీళ్లలో కలుపుకొని తాగగా గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని అన్నారు. మృతుడికి భార్య లక్ష్మి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు.

వ్యవసాయాధికారులపై కమిషనర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర–కృష్ణగిరి: పత్తికొండ, తుగ్గలి మండలాల వ్యవసాయ అధికారులు సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడంతో సమాచార హక్కు చట్టం కమిషనర్ చావలి సునీల్ కు నేషనల్ నవక్రాంత్ పార్టీ వ్యవస్థాపకులు కనకం శ్రీనివాసరావు, పత్తికొండ నియోజకవర్గం ఇన్చార్జి వాల్మీకి పెద్దయ్య ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుగ్గలి, పత్తికొండ మండలాలకు సంబంధించిన వ్యవసాయ అధికారులు సమాచార హక్కుచట్టం కింద వివరాలు కోరగా నిర్లక్ష్యం చేశారన్నారు. 2020-21 ఏడాదికి సంబంధించి సమాచార హక్కు చట్టం సెక్షన్ 6, 19/1 క్రింద ఖరీఫ్, రబి పంటలకు సంబంధించిన పొలంబడి కార్యక్రమాలు ఎన్ని గ్రామాల్లో చేశారు రైతుల పేర్లు ఆయా పంటలకు అయినా పొలంబడి కార్యక్రమం ఖర్చు ఎంత చేశారు? వాటి వివరాలను అడిగామన్నారు. ఇప్పటి దాకా వారి నుండి ఎలాంటి వివరాలు అందలేదన్నారు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వ్యవసాయ అధికారులపై విజయవాడకు వెళ్లి సమాచారం చట్టం కమిషనర్ కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా ఎవరు వెళ్లి వివరాలు అడిగిన వారికి ఇవ్వాలని చట్టం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు.

తెలంగాణ అక్రమ మద్యం పట్టివేత

విశాలాంధ్ర-నందికొట్కూరు : తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న భాస్కర్‌గౌడ్‌ను అల్లూరు సమీపంలోని కేసి కెనాల్ వద్ద బుధవారం బ్రాహ్మణ కొట్టుకూరు ఎస్సై తిరుపాల్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ద్విచక్ర వాహనంపై తెలంగాణ మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న అల్లూరుకు చెందిన భాస్కర్ గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. 20 బాటిళ్ల మాక్డోల్స్,10 ఆఫ్ బాటిల్లు మాక్ డోల్స్ మొత్తం 30 బాటిల్లు, మోటార్ బైకు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మనోహర్,నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర–నందవరం : మండల కేంద్రమైన నందవరం-ముగతి వరకు రోడ్డు అస్తవ్యస్తంగా మారడంతో ప్రయాణీకులు చాలా ఇబ్బందులకు గురికావడం, కొన్ని సమయాల్లో ముగ్గురు ప్రయణీకులు కూడా చనిపోవడం, రొడ్ల మధ్యలొ గుంతలవలన ప్రజలు ప్రమాదాలు జరుగుతున్నాయని దేశాయ్ నెట్వర్క్ అధినేత, మండల టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్ అన్నారు. రహదారిని పరిశీలించి ఎమ్మెల్యే డాక్టర్ బివి జయ నాగేశ్వర్ రెడ్డి తీసుకువెళ్లగా, వెంటనే మునిసిపల్ కార్యలయంలో అధికారాలతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర వెంటనే స్పందించి ఆర్ అండ్‌బి డిఇ నాగరాజుకి ఫోన్ చేసి తక్షణమే నందవరం-ముగతి వరకు రహదారిని పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని డిఇకి అదేశాలు జారీ చేశారన్నారు. తొందరలొనే కొత్త రోడ్డు నిర్మాణం కూడ చేయిస్తామని, ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయడం సంతోషకరమణానరు.మాజీ సర్పంచు రామన్న గౌడు, ఎంబి చర్చి సంఘ పెద్ద కె శివ, వడ్డె గోపాలు, సలీం, జెసిపి రాజు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టినగర్ పారిశుద్ధ్య పనుల్లో..

విశాలాంధ్ర–హెరాళగుంద: భారీ వర్షం వల్ల తీవ్రంగా నష్టపోయిన విజయవాడ ప్రజలకు ఆరోగ్యం కల్పించడానికి హెరాళగుంద పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది బుధవారం చిట్టినగర్ లో పారిశుద్ధ తొలగించే పనుల్లో పాల్గొన్నారు గ్రామ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విజయవాడకు వెళ్లి చిట్టినగర్‌లో పారిశుద్ధ పనులు ఎత్తివేత కార్యక్రమంలో పాల్గొన్నారు గ్రామ సుందరీకరణకు చర్యలు తీసుకున్నామని అన్నారు భారీ వర్షం వల్ల ఏర్పడిన పారిశుధ్యన్ని తొలగిస్తున్నామన్నారు.

వరద సహాయక చర్యల్లో పంచాయతీ సిబ్బంది

విశాలాంధ్ర–కోడుమూరు : వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల నిమిత్తం వెళ్లిన కోడుమూరు గ్రామపంచాయతీ సిబ్బంది అక్కడి ప్రభుత్వ యంత్రాంగం సూచించిన పనుల్లో చురుగ్గా పాల్గొని సేవలందిస్తున్నారు.రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోడుమూరు గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బంది విజయవాడలోని వరద ముంచెత్తిన ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొనేందుకు తరలి వెళ్లినట్లు గ్రామపంచాయతీ ఈవో అజయ్ భాస్కర్ తెలిపారు.మంగళవారం కోడుమూరు నుంచి బయలుదేరి బుధవారం ఉదయం విజయవాడకు చేరుకున్న వారు అక్కడి వరద సహాయక చర్యల్లో భాగంగా వారికి కేటాయించిన ప్రాంతాల్లో చెత్త సేకరణ, పారిశుధ్య పనులు వంటి తదితర పనుల్లో నిమగ్నమైనట్లు బుధవారం ఆయన వెల్లడించారు.కాగా 3వ సచివాలయం పంచాయతీ కార్యదర్శి జనార్ధన్ పర్యవేక్షణలో కోడుమూరు మేజర్ గ్రామపంచాయతీ నుంచి స్వీపర్లు,ఎలక్ట్రికల్ లైన్ మెన్ తదితర విభాగాల నుంచి సిబ్బంది మధు,నాగరాజు,శశికుమార్, విజయ్,బజారి,రాజు,అనిల్,బ్రహ్మయ్యలు మొత్తం 8మంది కార్మికులు మంగళవారం విజయవాడకు వెళ్లారని ఆయన తెలియజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డు ప్రధానం చేస్తాం

విశాలాంధ్ర–కర్నూలు ఎడ్యుకేషన్: కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డు అందజేస్తామని డిఇఓ కె సామ్యూల్ బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 23 ఉపాధ్యాయులను ఎంపిక చేశామన్నారు వారికి గురువారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 10 గంటలకు ఉత్తమ అవార్డు అందేస్తామన్నారు.

టీడీపీ నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి

విశాలాంధ్ర–హెరాళగుంద : తెలుగుదేశం పార్టీ నాయకుల పై వైకాపా ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని టిడిపి నాయకుడు ఎల్లార్తి మల్లికార్జున డిమాండ్ చేశారు నూతన పత్తికొండ డి.ఎస్.పి గ పదవి బాధ్యతలు చేపట్టిన వెంకట్రామయ్యను బుధవారం ఎల్లార్తి టిడిపి నాయకుడు మల్లికార్జున మర్యాదపూర్వకంగా కలిసిశాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు టిడిపి నాయకుడు ఎల్లార్తి మల్లికార్జున మాట్లాడుతూ పత్తికొండ డివిజన్లో శాంతి భద్రతలను కాపాడాలని గణేష్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు

ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన మౌర్య భరద్వాజ్

విశాలాంధ్ర–ఆదోని : ఆదోని డివిజన్ మూడవ సబ్ కలెక్టర్ గా మౌర్య భరద్వాజ్ బుధవారం ఉదయం 10 గంటలకు సబ్ కలెక్టర్ ఛాంబర్ లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ యుపిఎస్సి 2022 బ్యాచ్ ట్రైనింగ్ సంవత్సరం పాటు మసూరి లో పూర్తిచేసుకుని అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ గా కడపలో విధులు నిర్వహించి, మొదటి పోస్టింగ్ గా ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ నియామకం అవడం సంతోషమన్నారు. ముఖ్యంగా ఆదోని డివిజన్ నిరక్షరాస్యత, వలసలు, సాగు, త్రాగు నీటి సమస్యలను నివారించడానికి కృషి చేసి ప్రభుత్వం సూచించిన సూచికలలో ప్రణాళికలను అమలుచేసి ఆదోని డివిజన్ అభివృద్ధి కి కృషి చేస్తానన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ప్రతి సెక్షన్ ను పరిశీలించారు. అనంతరం డివిజన్లోని తాసిల్దారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు రెవెన్యూ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో రెవెన్యూ సదస్సులు, మరియు వందరోజుల ప్రణాళికలను ఎటువంటి తప్పులు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని తాసిల్దార్లకు ఆదేశించారు.

వరద బాధితులకు అందరూ అండగా నిలవాలి

విశాలాంధ్ర–హెరాళగుంద: భారీ వర్షం కారణంగా అతలాకుతలమైన విజయవాడ ,గుంటూరు తదితర ప్రాంతాల వరద బాధితులకు అందరూ అండగా నిలవాలని రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి చిన్న హ్యా ట శేషగిరి అన్నారు. హెరాళగుంద లో అన్ని రాజకీయ పార్టీ నాయకులు, వ్యాపారస్తులు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, వామపక్షాల నాయకులు, జర్నలిస్టులు, యువకులు తో కలిసి విజయవాడ బాధితుల కోసం వీరాల సేకరణ చేశారు ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి చిన్న హాట శేషగిరి మాట్లాడుతూ సర్వం కోల్పోయిన బాధితులకు ప్రజలు అందరూ నగదు, వస్తువులు, కూరగాయలు ఇతర సామాగ్రిలను అందించి సహాయం చేయాలని కోరారు. వరద బాధితుల సహాయం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. కేంద్రం జాతీయ విపత్తుగా పరిగణించి నిధులు మంజూరు చేసి వరద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరద బాధితుల కోసం మానవతా దృక్పథంతో అందరూ కలిసికట్టుగా ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, వామపక్షాల నాయకులు,జర్నలిస్టులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక..

విశాలాంధ్ర–ఆలూరు : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ విడుదల చేశారు. అందులో ఆలూరు మండలంలోని మొలగవల్లి ఎంపీపీపీ పాఠశాల లో హెచ్ ఎం టి.శ్రీనివాసులు, ఆలూరు మెయిన్ స్కూల్ లో ఎస్జిటి గా పనిచేస్తున్న మంజుల, అరికేర డా.బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో పిజిటి తెలుగు అధ్యాపకులుగా పని చేస్తున్న, సి.నరసింహులు ఎంపికయ్యారు. వీరు గురువారం జిల్లా కేంద్రం లో మంత్రి టిజి.భారత్, జిల్లా కలెక్టర్ రంజిత్ కుమార్ చేతులమీదుగా జిల్లాఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రశంస అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈ అవార్డులు మాలో మరింత బాధ్యతలను పెంచిందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నిక అవ్వడం ఆనందంగా ఉందన్నారు. వీరికి ఎస్టీయూ నాయకులు అభినందనలు తెలిపారు.

అంగరంగ వైభవంగా శ్రీకృష్ణ గ్రామోత్సవం

విశాలాంధ్ర–కొలిమిగుండ్ల : కొలిమిగుండ్లలో శ్రీకృష్ణ భగవాన్ గ్రామోత్సవాన్ని భక్తులు ప్రజలు,అంగరంగ వైభవంగా బుధవారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధానంద సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కొలిమిగుండ్ల కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి పండుగ వేడుకలలో భాగంగా శ్రీ లలిత సుందరేశ్వరి దేవాలయం ప్రాంగణంలో మండపం నందు శ్రీకృష్ణ విగ్రహాన్ని ఏర్పాటుచేసి పది రోజులపాటు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పూలమాలలతో అందంగా అలంకరించిన పల్లకిలో శ్రీకృష్ణ భగవాన్ గ్రామోత్సవం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు భక్తి పాటలు గీత బోధనలతో అంగరంగ వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పురవీధులలో గ్రామ ప్రజలు దేవదేవునికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణ భగవానుడు గీతా బోధనతో మానవాళికి అందించిన సందేశాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు సంజీవ బాబు అశోక్ నవీన్ కుమార్ హరికృష్ణ అవుకు టిడిపి నాయకులు కాట్రేడ్డి మల్లికార్జున రెడ్డి, అందే రాము, చిన్నపురెడ్డి, కొప్పుల శివ మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్, కుపేంద్ర, అనిల్, హుస్సేన్ నాయుడు, మద్దిలేటి పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకుందాం

విశాలాంధ్ర–కౌతాళం రూరల్: వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో కులమతాలకతీతంగా సంతోషంగా జరుపుకుందామని సిఐ అశోక్ కుమార్ అన్నారు. బుధవారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్లో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ పండుగలను అహ్లాదకర వాతావరణంలో సంతోషంగా కులమతాలకతీతంగా జరుపుకోవాలని సూచించారు ఎవరి మనోభావాలు దెబ్బ తీయకుండా ఇబ్బంది పెట్టకుండా పండుగ జరుపుకోవాలన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కమిటీ నాయకుడు మారుతి మోహన్ మాట్లాడుతూ మన మండలంలో ఇప్పటివరకు అందరం ఒకరినొకరు స్నేహభావంతో కలిసిమెలిసి పండుగ జరుపుకున్నామని ఈసారి కూడా అందరం అన్నదమ్ముల వలె పండుగను జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఉలిగయ్య,సిపిఎం మండల డివిజన్ కార్యదర్శి మల్లయ్య, వైసీపీ నాయ కుడు సుబ్బరాజు,ముస్లిం పెద్దలు ఖాదర్‌బాష, హుస్సేన్ పీర , వలి భాష తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర–గోనెగండ్ల:

వినాయక చవితి సందర్భంగా విగ్రహ మండపాలు ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసు అనుమతులు తీసుకోవాలని, డీజే సౌండ్ బాక్స్‌లకు అనుమతి లేదు. రోడ్లమీద మండపాలు ఏర్పాటుకు అనుమతి లేదు, ఇవ్వబడదు.మండపాలు ఏర్పాటు చేసుకునే కమిటీ సభ్యులు తప్పనిసరిగా పైన చూపిన పోర్టల్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు.

ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి

వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా రోడ్ల మీద మండపాలుఏర్పాటుచేయొద్దని సూచించారు. నిర్వాహకులు మండపాల వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలు విధిగా చేపట్టాలని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. నిమజ్జనం మూడోరోజు ఉండాలి. చీకటి పడే లోపు నిమజ్జనం పూర్తి చేసుకోవాలి. నిమజ్జనం చేసే చెరువు లేదా కాలువ అయినచో అక్కడ వెళ్లేదారి వివరాలు ముందుగానే చెప్పాలి. మండపాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు. మండపంలో 24 గంటలు ఒకరు హాజరుగా ఉండాలి.

విశాలాంధ్ర–సి.బెళగల్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వినాయక చవితిని పురస్కరించుకొని వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునే వారు కచ్చితంగా నియమ నిబంధనలను పాటించాలని సి.బెళగల్ ఎస్సై ఎం తిమ్మారెడ్డి కోరారు.

వినాయక చవితి పండుగ సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసుకునేవారు కచ్చితంగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని అలాగే మండపాల దగ్గర డిజె సౌండ్లకు అనుమతి లేదని మండపాలు ఏర్పాటు చేసుకునే కమిటీ సభ్యులు తప్పనిసరిగాhttps://GaneshUtsav.net అను పోర్టల్ లో నమోదు చేసుకోవాలి అలాగే విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలి మరియు వాహనదారులకు ఇబ్బంది కలిగించకూడదు మరియు మండపాల దగ్గర పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టాలి అలాగే వినాయకుని నిమజ్జనం మూడవరోజు కచ్చితంగా చేపట్టి చీకటి పడే లోవు నిమజ్జనం పూర్తి చేయాలి. నిమజ్జనం ఎక్కడ చేస్తారనేవివరాలు పోలీసు వారికి ముందుగాచెప్పాలి. నిమజ్జనం కోసం ఉపయోగించే వాహనా లకు తప్పనిసరిగా అన్ని పేపర్లు ఉండి వాహనాన్ని నడిపే వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ కచ్చితంగా కలిగి ఉండాలి. వినాయకుని నిమజ్జనం రోజు మద్యం సేవించిన వ్యక్తులు మండపాల దగ్గరకు గాని ఊరేగింపు వద్దకు రాకుండా అలాగే ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు చేయకుండా ఉండాలి. వినాయక చవితి సందర్భంగా మరియు నిమజ్జనం సందర్భంగా ఏదైనా చట్ట వ్యతిరేక చర్యలు జరిగిన ఎడల కమిటీ సభ్యులు మొత్తం బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్ఐ ఎం తిమ్మారెడ్డి తెలిపారు.

ఆళ్లగడ్డలో హుబిలక షార్ట్ ఫిలిం టీజర్ విడుదల



విశాలాంధ్ర–ఆళ్లగడ్డ : పట్టణంలోని షాది ఖానా సమీపంలో ఉన్న దర్బార్ టీ స్టాల్ నందు బుధవారం హుబిలక (తుమారే లియే మేర ప్యార్) షార్ట్ ఫిలింను కౌన్సిలర్ హుస్సేన్ భాష, డా.ఏవి రామసుబ్రహ్మణ్యం, అపుస్మా నంద్యాల డివిజన్ అధ్యక్షులు టి.అమీర్‌భాషలు టీజర్‌లు విడుదల చేశారు. ఈసందర్భంగా కౌన్సిలర్ హుస్సేన్ భాష మాట్లాడుతూ హుబిలక డైరెక్టర్ ఇమ్రాన్ భాషకు మంచి టాలెంట్ ఉందని భవిష్యత్తులో మంచి దర్శకుడు అయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే డా.రామసుబ్రమణ్యం మాట్లాడుతూ ఆళ్లగడ్డకు చెందిన యువకుడు ఈ స్థాయికి రావడం చాలా సంతోషకర మన్నారు. ఇలాగే భవిష్యత్తులో కూడా మంచి లఘు చిత్రాలు ఆవిష్కరణ చేసుకుంటూ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అపుస్మా నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ భాష మాట్లాడుతూ హుబిలక షార్ట్ ఫిలిం తీస్తున్న నా కుమారుడు ఇమ్రాన్ భాష ను అందరూ ఆశీర్వదించాలని అలాగే తన టాలెంట్ను ప్రోత్సహించాలని కోరారు. హుబిలక డైరెక్టర్ ఇమ్రాన్ భాష మాట్లాడుతూ నేడు ఈ షార్ట్ ఫిలిం టీజర్ విడుదల సందర్భంగా ఆళ్లగడ్డ ప్రజలందరి ఆశీస్సులు ప్రోత్సాహం కావాలని ఆశిస్తూ ఈ షార్ట్ ఫిలిం ఈనెల ఆరవ తేదీన రాత్రి యూట్యూబ్లో విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బ్రహ్మయ్య, కెమెరామెన్ గఫర్ బాబా, హుబిలక షార్ట్ ఫిలిమ్స్ సభ్యులు నజీర్, రామయ్య, హనీఫ్, వీరేశ్వర్, మహమ్మద్ హుస్సేన్, సాదిక్ భాషా, మాబు హుస్సేన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల విజన్ ప్లాన్ పై వర్క్ షాప్

విశాలాంధ్ర–కొలిమిగుండ్ల: మండలంలోని ఆయా శాఖ అధికారులతో మండల విజన్ ప్లాన్‌పై గురువారం వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర 2047లో భాగంగా ఐదేళ్లకు మండల విజన్ ప్లాన్ తయారు చేయాల్సి ఉందన్నారు. మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో వర్క్ షాప్ జరుగుతుందని అధికారులందరూ హాజరుకావాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు

విశాలాంధ్ర కొలిమిగుండ్ల : 2024కు గాను మండలం నుండి నలుగురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనందుకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బెలుం జెడ్పి ఉన్నత పాఠశాల హెచ్.ఎం.కె ప్రసాదరావు, చింతలాయిపల్లి విజయ ప్రసన్న, అంకిరెడ్డిపల్లి సుబ్బయ్య,కొలిమిగుండ్ల బాలనరసింహారెడ్డిలను అభినందనలు తెలిపారు.